ప్రభాత
# ఉదయం
తెలుగు దినపత్రిక



**రిపోర్టర్లు కావలెను**

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 205 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 5 నవంబర్ 2025 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి




# ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం

## ప్యాసింజర్, గూడ్స్ ఢీ.. 8 మంది మృతి!

### బిలాస్‌పుర్‌లో ఎదురెదురుగా ఢీకొన్న ప్యాసింజర్, గూడ్స్ రైలు

**బిలాస్‌పుర్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)**

ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం జరిగింది. బిలాస్‌పుర్‌లో ప్యాసింజర్, గూడ్స్ రైలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. అయితే, ప్రమాదానికి గల కారణం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. సిగ్నల్ వ్యవస్థ వైఫల్యం లేదా మానవ తప్పిదం వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు ప్రకారం, ఈ ఘటన బిలాస్‌పుర్ సమీపంలోని లాల్ ఖదాన్ ప్రాంతంలో మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో జరిగింది. గేవ్రా నుంచి బిలాస్ పుర్ వైపు వెళ్తున్న ప్యాసింజర్ రైలు, గూడ్స్ ట్రైన్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ప్యాసింజర్ రైలు ముందు భాగం గూడ్స్ ట్రైన్‌పైకి ఎక్కింది. ఒక బోగీ పూర్తిగా దెబ్బతింది. ఈ ప్రమాదంలో 8 మంది మృతి చెందారు. 14 మంది గాయపడినట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం, రైల్వే యంత్రాంగం ఘటనాస్థలిలో సహాయచర్యలు చేపట్టాయి. దెబ్బతిన్న రైల్ కోచ్‌ల్లో చిక్కుకున్నవారిని రక్షించాయి. ఈ క్రమంలో నాలుగు మృతదేహాలను వెలికితీశాయి.

**రైల్వే శాఖ దర్యాప్తు**

ఈ దుర్ఘటనపై రైల్వే అధికారులు దర్యాప్తు చేపట్టారు. రైల్వే భద్రతా కమిషనర్ స్థాయిలో

..మిగతా 2లో

## 30 వేల ఓట్ల మెజార్టీతో

# కాంగ్రెస్ గెలవబోతుంది

- రేవంత్ రెడ్డి జోస్యం
- గతంలో పీజేఆర్ చనిపోయినప్పుడు కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టారన్న రేవంత్ రెడ్డి
- తనను గెంటేశారని కవిత రాష్ట్రమంతా తిరిగి గోడు చెప్పుకుంటోందన్న ముఖ్యమంత్రి
- జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే
- 4 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తా: ముఖ్యమంత్రి



**హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)**

జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించబోతోందని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఎస్పీఆర్ హిల్స్ నుండి హబీబ్ ఫాతిమా నగర్ వరకు జరిగిన రోడ్డు షోలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే 4 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. మాగంటి గోపీనాథ్ మరణించారని, ఆయన భార్యను ఇప్పుడు బరిలోకి దింపి గెలిపించాలని బీఆర్ఎస్ కోరుతోందని, అయితే గతంలో పీజేఆర్ మరణించినప్పుడు జరిగిన ఉప ఎన్నికల్లో కేసీఆర్ పోటీకి నిలబెట్టారని గుర్తు చేశారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మరణిస్తే వచ్చే ప్రతి ఉప ఎన్నికలోనూ కేసీఆర్ అభ్యర్థిని నిలబెట్టారని విమర్శించారు. కేటీఆర్‌కు ఇన్ని వేల కోట్ల రూపాయలు ఎక్కడి నుంచి వచ్చాయని ఆయన ప్రశ్నించారు. సొంత ఇంటి నుంచి తనను గెంటేశారని కవిత రాష్ట్రమంతా తిరుగుతూ తన గోడు వెళ్లబోసుకుంటున్నారని ముఖ్యమంత్రి అన్నారు. సొంత చెల్లికి న్యాయం చేయలేని కేటీఆర్ ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. బీఆర్ఎస్

..మిగతా 2లో



## ఫిరాయింపు ఎమ్మెల్యేల

# కేసు విచారణ

### మరోమారు షెడ్యూల్ ప్రకటించిన స్పీకర్

### ఈ నెల 6 నుంచి వరుసగా విచారణలకు సిద్ధం

**హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)**

తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారిన పార్టీ ఫిరా యింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మరో అడుగు పడింది. ఎల్లుండి నుండి ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ జరుగనుంది. ఈనెల 6 నుంచి ఈ కేసును స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ విచారించనున్నారు. పార్టీ మారిన ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్లపై విచారణకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ షెడ్యూల్ ఇచ్చారు. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ గుర్తుపై గెలిచిన పదిమంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసింది. దీంతో పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలంటూ బీఆర్ఎస్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీంతో మూడు నెలల్లోగా విచారించి నిర్ణయం వెల్లడించాలని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం జూలై 31న తీర్పునిచ్చింది. ఈ నేపథ్యంలో నలుగురు ఎమ్మెల్యే విచారణను పూర్తిచేసిన స్పీకర్.. తాజాగా ఈ నెల 6 నుంచి మరో నలుగురు ఎమ్మెల్యేలు పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీ, తెల్లం వెంకట్రావు, డాక్టర్ సంజయ్ అనర్హతపై విచారణ చేపట్టనున్నారు. నవంబర్

..మిగతా 2లో

## చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన..

# సుమోటోగా కేసు నమోదు



### మానవహక్కుల సంఘం

**హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)**

రంగారెడ్డి జిల్లా చేవెళ్లలో జరిగిన బస్సు ప్రమాద ఘటన ఎన్నో కుటుంబాల్లో విషాదాన్ని నింపింది. తమ వారిని కోల్పోయి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. చేవెళ్ల బస్సు ప్రమాద ఘటనను రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు నమోదు చేసింది. మీడియా ఛానల్స్, పలు పత్రికల్లో వచ్చిన కథనాల ఆధారంగా కమిషన్ చర్యలు తీసుకుంది. ఈ సంఘటనపై డిసెంబర్ 15లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని రోడ్లు రవాణా, భవనాల శాఖ, హోంశాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీలకు కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. రంగారెడ్డి జిల్లా కలెక్టర్, ఆర్టీసీ ఎండీ, నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజినల్ ఆఫీసర్ కు కూడా నివేదిక సమర్పించాలని హెచ్ఆర్‌సీ

..మిగతా 2లో



# ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులు

- ప్రభుత్వం కీలక నిర్ణయం
- సంస్కరణలపై అధ్యయానికి కమిటీ ఏర్పాటు
- కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు

**హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులకు ప్రభుత్వం సంకల్పించింది. ఇందులో చాలా అవతకవకలతో పాటు, అక్రమాలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఫీజుల చెల్లింపుల్లో తీవ్ర

..మిగతా 2లో

# వ్యవసాయం మనజీవన విధానం

- 54 శాతం జనాభా వ్యవసాయంపై ఆధారపడి జీవనం
- దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉంది
- 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో ప్రపంచంలోనే తొలిస్థానం
- అగ్రి బిజినెస్ అవార్డుల ప్రదానంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి




**హైదరాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం)**

దేశంలో ఎన్ని మార్పులు వచ్చినా.. వ్యవసాయం ఇప్పటికీ మన జీవన విధానంలో భాగమేనని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. దేశంలోని 54 శాతం జనాభా ఇప్పటికీ వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పుకొచ్చారు. వ్యవసాయ రంగం దేశ జీడీపీలో 18 శాతం భాగస్వామ్యం కలిగి ఉందని వివరించారు. అగ్రి బిజినెస్ అవార్డులు ఇవ్వడం ద్వారా భారతదేశ వ్యవసాయరంగానికి ఎనలేని సేవలు అందిస్తున్న రైతులకు, ఇన్నొవేటర్స్, అగ్రిప్రెన్యూర్స్‌ని గౌరవించు కోవడమేనని పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ పార్క్ హయత్

..మిగతా 2లో

ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక

# పాలకుల నిర్లక్ష్యంతో పేద విద్యార్థులకు అన్యాయం

**పాఠశాల విద్యార్థులపై ఇంత నిర్లక్ష్యమా...?**

**260 మంది విద్యార్థులకు కేవలం ముగ్గురు టీచర్లు, ఒక డిప్యూటేషన్ టీచర్ మాత్రమే...?**

**సిలబస్ పూర్తికాక విద్యార్థులకు అవస్థలు**

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్.**



**గద్వాల జిల్లా ప్రతినిధి,(గట్టు), నవంబర్4 (ప్రభాత ఉదయం)**

ఆసియా ఖండంలోనే అత్యంత వెనకబాటు తనానికి గురైన గట్టు మండలంపై రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుందని నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా చైర్మన్ గొంగళ్ళ రంజిత్ కుమార్ ఆరోపించారు. మంగళవారం గట్టు మండలంలోని ఆరగిద్ద గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను నడిగడ్డ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....ఆరు నుండి పదవ తరగతి వరకు ఉన్న పాఠశాలలో 260 మంది విద్యార్థులకు గాను కేవలం ముగ్గురు టీచర్లు మరియు ఒక డిప్యూటేషన్ టీచర్ ఉన్నారని,తెలుగు,ఫిజికల్ సైన్స్, బయాలజికల్ సైన్స్ సబ్జెక్టులను బోధించేందుకు ఉపాధ్యాయులు లేక విద్యా బోధన కుంటు పడిందని, త్వరలో రాబోయే రోజుల్లో పరీక్షలు రాసే సమయంలో విద్యార్థులకు తీవ్ర ఆటంకం ఏర్పడుతుందని తెలిపారు. విద్య హక్కు చట్టం ప్రకారం 9 మంది టీచర్లు ఉండాల్సిన పాఠశాలలో కేవలం ముగ్గురు మాత్రమే ఉండడాన్ని బట్టి చూస్తే విద్యా వ్యవస్థపై రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్య ధోరణి తో ఉన్నదని, కనీసం రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రి లేని దౌర్భాగ్యం ఏర్పడిందని అన్నారు.

ఇప్పటిదాకా గత ప్రభుత్వాలు గట్టు మండలాన్ని దత్తత తీసుకుంటామని హామీలు ఇచ్చారే తప్పా ఇప్పటివరకు ఏ హామీలు కూడా అమలు కాలేదన్నారు. విద్యార్థులకు ఓటు హక్కు లేనందుకు ఇంత నిర్లక్ష్యం చేస్తున్నారా లేక చదువుకుంటే చైతన్యమై పాలకులను ప్రశ్నిస్తారనే కోణంలో అన్యాయం చేస్తున్నారా? అని ధ్వజమెత్తారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకై నడిగడ్డ హక్కుల పోరాట సమితి తరపున ఒక విద్యా వాలంటీర్ టీచర్ ను మా వంతు బాధ్యతగా నియమిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడికి, విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా కన్వీనర్ బుచ్చిబాబు, జిల్లా కార్యదర్శి లవన్న, జిల్లా నాయకులు రంగస్వామి, గట్టు మండల అధ్యక్షుడు బలరాం నాయుడు, మండల నాయకులు దయాకర్,ఆంజనేయులు, గోపాల్,బంగి పరుష, నాగేష్, సురేష్, అమరేష్, గొర్ల తిమ్మప్ప, ఆరగిద్ద గ్రామ కమిటీ నాయకులు హనుమంతు, నరసింహ,మల్దకల్ బి. నరసింహ, మల్దకంటి, వీరన్న,రామకృష్ణ,తాయప్ప, రామాంజనేయులు, రంగన్న, నల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయం మన జీవన విధానం

**మొదటి పేజీ తరువాయి...**

హోటల్‌లో అగ్రి బిజినెస్ అవార్డుల కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. రైతులు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ బలంగా నమ్ముతారని నొక్కిచెప్పారు. అందుకే అనేక పథకాలు రైతులకు మేలు చేసేలా రూపొందించారని తెలిపారు. ఈ ఏడాది చైనాను దాటేసి 149 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో భారతదేశం ప్రపంచంలోనే తొలిస్థానంలో నిలిచిందని ఉద్ఘాటించారు. 2014 నుంచి 2015 మధ్యలో పాల ఉత్పత్తి 63 శాతం పెరిగిందని చెప్పు కొచ్చారు. ఇప్పటికీ ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ పాలు ఉత్పత్తి చేసే దేశంగా మనం నిలిచామని పేర్కొన్నారు. ఆత్మ నిర్భర భారత్ దిశగా దూసుకెళ్లేందుకు వ్యవసాయ రంగం కీలక పాత్ర పోషిస్తోందని ఉద్ఘాటించారు. పప్పు ధాన్యాల ఉత్పత్తిలో ప్రపంచలోనే తొలిస్థానంలో నిలిచామని వివరించారు. దేశంలో 26 మిలియన్ టన్నుల పప్పు ధాన్యాల ఉత్పత్తి జరుగుతోందని వెల్లడించారు. కరోనా సమయంలో ప్రపంచవ్యాప్తంగా సరఫరా విషయంలో ఎన్ని ఇబ్బందులు తలెత్తినా ఆహార ధాన్యాలు సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. వేరే దేశాలకు కూడా భారతదేశం నుంచి ఎగుమతి చేశామని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో దేశంలోని 80 కోట్ల మందికి ఉచితంగా 5 కేజీల చొప్పున బియ్యం ఇస్తున్నామని తెలిపారు. పీఎం కిసాన్, పీఎం కృషి సించాయి యోజన వంటి అద్భుతమైన పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు కిషన్‌రెడ్డి. 2019లో పీఎం సమ్మాన్ నిధి యోజన ప్రారంభించినప్పటి నుంచి 11.8 కోట్ల మంది రైతులకు 21 విడతల్లో రూ.4 లక్షల కోట్ల నగదు రైతుల ఖాతాల్లో జమ చేశామని స్పష్టం చేశారు. ఈ పథకం ద్వారా చిన్న, మధ్య తరహా రైతులకు భరోసా దక్కిందని నొక్కిచెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా రైతులు లబ్ది పొందుతున్నారని వివరించారు. 2014 నుంచి ఇప్పటివరకు వరి ధాన్యం కనీస మద్దతు ధర భారీగా పెంచామని వెల్లడించారు. జీఎస్టీ 2.0 ద్వారా రైతులకు ఉపయోగపడేలా ట్రాక్టర్లు, మెషీన్లపై భారీగా జీఎస్టీ తగ్గించామని ప్రకటించారు. జీఎస్టీ తగ్గించడంతో రైతులకు ఎంతో మేలు జరుగుతోందని చెప్పుకొచ్చారు. సాగు ఖర్చు కూడా భారీగా తగ్గి, రైతుల ఆదాయం మరింత పెరుగుతుందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, డ్రోన్స్ వంటి అగ్రి టెక్నాలజీ ద్వారా వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే 4 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తా

**మొదటి పేజీ తరువాయి...**

హయాంలో ఒక్కరికైనా రేషన్ కార్డు ఇచ్చారా అని నిలదీశారు. తాము అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 14,159 రేషన్ కార్డులు మంజూరు చేశామని తెలిపారు. బీఆర్ఎస్ గెలిస్తే ప్రస్తుతం అందుతున్న పథకాలు కూడా ఆగిపోతాయని హెచ్చరించారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది ఫెవికాల్ బంధం అని ఆరోపించారు. కాళేశ్వరం కేసును సీబీఐకి అప్పగిస్తే 48 గంటల్లో కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపిస్తామని చెప్పారని, సీబీఐకి అప్పగించి మూడు నెలలైనా కేసు నమోదు చేయలేదని విమర్శించారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసి కేసీఆర్, కేటీఆర్, హరీశ్ రావులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఫార్ములా ఈ-రేసు కేసులో కేటీఆర్ అరెస్టుకు గవర్నర్ అనుమతి కోరితే స్పందన లేదని అన్నారు.





# డ్రగ్స్ వినియోగ కేంద్రంగా హైటెక్ సిటీ

**పీజీ కోలివింగ్ హాస్టల్లో పబ్బులు స్టార్ హెూటల్**

శేరిలింగంపల్లి. నవంబర్4( ప్రభాత ఉదయం)హైటెక్ సిటి పరిధిలో మత్తు వినియోగం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతుంది. ఈ ప్రాంతంలోని స్టార్ హెూటళ్లు, కోలివింగ్ పీజీ హాస్టళ్లు డ్రగ్స్ వినియోగ కేంద్రాలుగా మారుతున్నాయి. పబ్ కల్చర్ కారణంగా యువత మద్యం, గంజాయి తోపాటు హెరన్ లాంటి మత్తు పదార్థాలకు బానిలవుతున్నారు. పోలీసులు డ్రగ్ కంట్రోల్ అధికారం అప్పుడప్పుడు విశ్వసనీయ సచారంతో తనిఖీ చేస్తుంటే ఎదోక మూలన మత్తు పదార్థాల వినియోగించేవారు సరఫరా చేసేవాళ్ళు బయటపడుతునే ఉన్నారు. పని వత్తిడి ఎక్కువ ఉండే ఐటి ఉద్యోగులకు వారంతరంలో పార్టీల పేరుతో మత్తు కూపం దింపుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. తాజా మాదాపూర్ ఎస్ ఓటీ బృందం గచ్చిబౌలి పోలీసులు అంతర్జాతీయ డ్రగ్స్ ముఠాను అరెస్టు చేయడంతో మారోమారు కోలివింగ్, పీజీ హాస్టల్స్ పై అనుమానం వ్యక్తమవుంది. గచ్చిబౌలిలోని డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిందితుల వివరాలను మాదాపూర్ అదనపు డీసీపీ ఉదయ్ రెడ్డి వివరించారు. అత్యంత విశ్వాసనీయ సమాచారంతో మాదాపూర్ ఎస్ఓటి గచ్చిబౌలి పోలీసులు టీఎన్ఓ కాలనీలోని ఎస్ఎం కో లివింగ్ హాస్టల్ పై రైడ్ చేశారు. కో లివింగ్ హాస్టల్ లో తేజ కృష్ణ, లోకేష్ రెడ్డి వద్ద డ్రగ్స్ ను స్వాధీనం చేసుకున్నారు. వారు ఇచ్చిన సమాచారం మేరకు మాదాపూర్ లోని నైట్ ఐ హెూటల్ లో నాలుగురు దొరికారని ఏడీసీపి తెలిపారు. వారి వద్ద కూడా డ్రగ్స్ లభించారని తెలిపారు. ఈ కేసులో మొత్తం 13 మందిని అరెస్ట్ చేశామని మరో ఆరుగురు పరారీలో ఉన్నట్లు వివరించారు. అరెస్టు అయిన వారిలో ఆరుగురు ఫెడ్లర్లు, ఐదు మంది కన్స్యూమర్లు ఉన్నారని చెప్పారు. బెంగళూరులో ఉంటున్న ఇద్దరు నైజీరియన్ల నుండి తేజ కృష్ణ డ్రగ్స్ కొనుగోలు చేసి నగరానికి తీసుకోచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఇద్దరు నైజీరియన్లు పరారీ లో ఉన్నారని వారిని కూడా త్వరలో అదుపులోకి తీసుకుంటామని ఉదయ్ కుమార్ రెడ్డి తెలిపారు. బెంగళూరు నుండి డ్రగ్స్ తీసుకు వచ్చి తేజ లోకల్ గా ఉన్న యువత, స్టూడెంట్ లకు అమ్ముతాడని ఇప్పటివరకు అన్ని లావాదేవీలు ఆధారాలు సేకరించామని నిందితులు రిమాండ్ కు తరలించామన్నారు. కడపకు చెందిన తేజ కృష్ణ ఆర్కిటెక్ట్ చదవి డగ్స్ ఫెడ్లర్ మారడని తెలిపారు. మొత్తం ఈ కేసులో 19 మంది ఉన్నారని ఇందులో 9 మంది ఫెడ్లర్లు కాగా మిగిలిన వారు కన్స్యూమర్లన్నారు. పరారీలో ఉన్నవారిలో నలుగురు ఫెడ్లర్లు ఉన్నారు. తేజ కృష్ణ పై గతంలో మూడు ఎన్డీపీఎస్ కేసులు ఉన్నాయని ఏడీసీపీ చెప్పారు. తేజ కృష్ణ, లోకేష్ రెడ్డిలతో పాటు షాజీర్ మోటుంగర్, వెన్నెల రవికిరణ్ మన్నె వెంకట ప్రశాంత్, పృధ్వి విష్ణువర్ధన్, సుజీత్, మేకల గౌతం, గుంటక సతీష్ రెడ్డి, గుండెబోయాన నాగరాజులను అరెస్టు చెసినట్లు తెలిపారు. కార్యక్రమం మాదాపూర్ ఏసీపీ శ్రీధర్ గచ్చిబౌలి సీఐ అబీబులాఖాన్, డీఐ నరేష్, ఎస్ఓటీ సీఐ అంజిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.



జిన్నింగ్ మిల్ యజమానులు సీసీఐ అధికారులతో సమీక్ష చేస్తున్న జిల్లా కలెక్టర్

# పత్తి రైతులకు ఇబ్బంది కలగొద్దు

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(ప్రభాత ఉదయం): పత్తి విక్రయించడానికి వచ్చే రైతులను జీన్నింగ్ మిల్లు ల యాజమాన్యం, సీసీఐ అధికారులు ఎలాంటి ఇబ్బందులకు గురి చేయొద్దని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. పత్తి కొనుగోలు పైన వ్యవసాయ, మార్కెటింగ్, జీన్నింగ్ మిల్లుల యాజమాన్యం తో కలెక్టరెట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో మంగళవారం కలెక్టర్ రివ్యూ చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, నాణ్యత పేరిట తిరస్కరించకుండా కొనుగోలు చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బందులు కలగకుండా, తేమ శాతం వంటి కారణాలతో వారి పత్తిని కొనుగోలు చేయకుండా, ఇబ్బందులకు గురి కాకుండా తగువిధంగా చర్యలు తీసుకోవాలని జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాన్ని, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ, సిసిఐ అధికారులకు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశం లో అదనపు కలెక్టర్ బె న్న లోమ్, డీసీపీ రాజా మహేంద్ర నాయక్,జిల్లా మార్కెటింగ్ అధికారి నరేంద్ర, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంబికా సోని, జిల్లా ఫైర్ అధికారి, విద్యుత్ శాఖ అధికారి, సి సి ఐ అధికారి, మార్కెట్ కమిటీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



జిల్లాస్థాయి యువజన ఉత్సవాల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు

# కళానైపుణ్యాల ప్రదర్శనకు చక్కటి వేదిక

**ఘనంగా యువజనోత్సవాలు ..**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(ప్రభాత ఉదయం): జిల్లా యువజన ఉత్సవాలను స్థానిక జూబ్లీ ఫంక్షన్ హాల్ లో మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత సాంస్కృతిక కళా రంగాలలోని అవకాశాలను పూర్తిగా వినియోగించుకోవాలని కోరారు. దీనివలన భవిష్యత్తులో ప్రతి చోట ఉద్యోగ అవకాశాలలోనూ సాఫ్ట్వేర్ రంగంలోనూ వీరికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలలోను ప్రత్యేక అంశంగా వీటిని తీసుకుంటారని విద్యార్థులు యువత గమనించాలని కోరినారు. ప్రతి అంశంలోనూ పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. కళలను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను అభినందించినారు. యువత అధిక సంఖ్యలో పాల్గొని మన జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి లోనూ జాతీయస్థాయిలోనూ ప్రతిభ కనబరచాలన్నారు. ఇటువంటి పోటీలను యువత ఉపయోగించుకొని జిల్లా స్థాయిలోనూ, రాష్ట్రస్థాయిలోనూ మంచి ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు ప్రతిష్టలు తీసుకురావాలన్నారు. ఈ యువజన ఉత్సవాలలో ప్రతిభ నైపుణ్యము కనబరిచి ఉత్సాహంగా పాల్గొనాలన్నారు. ఈ పోటీలలో జానపద గేయాలు జానపద నృత్యాలు , కథారచన ఉపన్యాసం, కవిత్వము, సైన్స్ మేళ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి కోదండరాములు,జిల్లా సైన్స్ అధికారి సిఎచ్ ఉపేందర్, యువత, తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల బస్సు ప్రమాద ఘటన.. సుమోటోగా కేసు నమోదు

**మొదటి పేజీ తరువాయి...**

ఆదేశించింది. మరోవైపు చేవెళ్ల బస్సు ప్రమాదంపై పోలీసుల విచారణ కొనసాగుతోంది. ప్రమాదం జరిగిన స్థలాన్ని డీజీపీ శశిధర్ రెడ్డి, సీపీ అవినాష్ మహంతి, ఇతర పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలించారు. ఃూగా... నిన్న(సోమవారం) తెల్లవారుజామున తాండూరు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరిన ఆర్టీసీ బస్సు చేవెళ్ల మండలం మిర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. బస్సును కంకర లోడ్‌తో వెళ్తున్న లారీ బలంగా ఢీకొట్టింది. దీంతో లారీలో ఉన్న కంకర మొత్తం బస్సులో కుప్పగా పడిపోయింది. ఈ ప్రమాదంలో 19 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 34 మంది గాయపడటంతో వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. టిప్పర్ అతివేగం కారణంగానే ప్రమాదం జరిగిందని పోలీసులు నిర్ధారించారు.

# ఛత్తీస్‌గఢ్‌లో రైలు ప్రమాదం

**మొదటి పేజీ తరువాయి...**

దర్యాప్తు జరుగుతుంది. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. సిగ్నల్ వ్యవస్థ వైఫల్యం లేదా మానవ తప్పిదం మొదటి పేజీ తరువాయి... వల్లే ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు ఈ ప్రమాదంతో బిలాస్‌పూర్-హావ్‌డా లైన్ మార్గంలో రైల్లరాకపోకలకు పూర్తి అంతరాయం ఏర్పడింది. దాంతో పలు సర్వీసులను రద్దు చేశారు. మరికొన్నింటిని దారిమళ్లించారు. ఈ ఘటన వల్ల ఆ మార్గంలో ఎలక్ట్రిక్ వైర్లు, సిగ్నల్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రయాణికులను బిలాస్‌పూర్‌లోని అపోలో ఆస్పత్రి, ఛత్తీస్‌గఢ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు తరలించారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని బిలాస్‌పూర్ జిల్లా కలెక్టర్ సంజయ్ అగర్వాల్ తెలిపారు.

**స్పందించిన సీఎం**

ఈ ఘటనపై ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణు దేవ్ సాయి స్పందించినట్లు సీఎం ఆఫీస్ ఎక్స్‌లో చేసింది. 'బిలాస్‌పూర్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదం వార్త చాలా బాధాకరం. బిలాస్‌పూర్ జిల్లా కలెక్టర్‌కు సమాచారం అందించి, సాధ్యమైనంత సహాయ చర్యలు అందించాలని సీఎం ఆదేశించారు. ఈ క్లిష్ట సమయంలో బాధిత కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుంది. రైల్వే, పరిపాలనా బృందాలు వెంటనే సహాయక చర్యలలో నిమగ్నమయ్యాయి. గాయపడిన వారికి చికిత్స కోసం అవసరమైన అన్ని వనరులు, వైద్య సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత అత్యవసరంగా సున్నితత్వంతో పరిస్థితిని పర్యవేక్షిస్తోంది' అని సీఎంఓ తెలిపింది.

**ఎక్స్ గ్రేషియా ప్రకటించిన రైల్వే శాఖ**

మరోవైపు రైల్వే శాఖ ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మృతుల కుటుంబాలకు రూ.10 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వలంగా గాయపడిన వారికి లక్ష చొప్పున పరిహారం ఇవ్వనుంది.

ప్రయాణీకుల కుటుంబాల సౌలభ్యం కోసం రైల్వే శాఖ హెల్ప్ లైన్ నంబర్లను విడుదల చేసింది.

బిలాస్‌పూర్ - 7777857335, 7869953330
చంపా - 8085956528 రాయ్‌గఢ్ - 9752485600
పెండ్రా రోడ్ - 8294730162 కోర్బా - 7869953330

# ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణ

**మొదటి పేజీ తరువాయి...**

6న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లను విచారిస్తారు. ఈ నెల 7న పోచారం శ్రీనివాస్ రెడ్డి, అరికెపూడి గాంధీని విచారించనున్నారు. 12న తెల్లం వెంకట్రావ్, సంజయ్ పిటిషన్లపై రెండోసారి విచారణ కొనసాగనుంది.. 13న పోచారం, ఆరికెపూడి గాంధీల పిటిషన్లపై మరోసారి విచారణ నిర్వహిస్తారు. కాగా.. సుప్రీంకోర్టు ఇచ్చిన గడువు గత నెల 31న ముగిసిన విషయం తెలిసిందే. దీంతో నాలుగు రోజుల క్రితం ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై విచారణకు మరో రెండు నెలల గడువు ఇవ్వాలని శాసనసభ స్పీకర్ కార్యాలయం సుప్రీంకోర్టును కోరింది. నలుగురు ఎమ్మెల్యేల విచారణ మాత్రమే పూర్తయిందని.. అంతర్జాతీయ సదస్సులు ఉండటంతో గడువు సరిపోలేదని దేశ అత్యున్నత న్యాయస్థానానికి తెలిపింది. 6వ తేదీన భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, జగిత్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే సంజయ్ కుమార్ లను విచారించనున్నారు. 13న కామారెడ్డి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కేసు విచారించనున్నారు. ఇప్పటికే నలుగురు ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నేతలు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. స్పీకర్ నుంచి సరైన స్పందన రాకపోవడంతో హైకోర్టును ఆశ్రయించారు. అత్యున్నత న్యాయస్థానం నుంచి బీఆర్ఎస్‌కు సానుకూల తీర్పు రాకపోవడంతో సుప్రీంకోర్టులో పిటిషన్ వేశారు. ఈ మేరకు విచారణ చేపట్టిన సర్వోన్నత న్యాయస్థానం.. ఈ వ్యవహారంపై మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని జూలై 31న ఆదేశాలు జారీ చేసింది. కాగా, ఆ గడువు అక్టోబర్ 31తో ముగిసింది. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలను స్పీకర్ విచారించనున్నారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానంలో మార్పులు

**మొదటి పేజీ తరువాయి...**

జాప్యం చోటు చేసుకొంటున్న నేపథ్యంలో కాలేజీ యాజమాన్యాలు ఆందోళనకు దిగాయి. కాలేజీల బంద్ కొనసాగి స్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి సంస్కరణలపై కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులను జారీ చేసింది. స్పెషల్ చీఫ్ సెక్రటరీతో పాటు 15 మందితో ఈ కమిటీని నియమించింది. ఇక కాలేజీల నుంచి ఈ కమిటీలో ముగ్గురికి చోటు కల్పిస్తున్నట్లు జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. అలాగే ఈ కమిటీలో ప్రొఫెసర్లు కంచ ఐలయ్య, కోదండరాంలకు చోటు కల్పించినట్లు స్పష్టం చేసింది. ఈ కమిటీ.. పీజు రీయింబర్స్‌మెంట్ పాలసీపై ప్రభుత్వానికి సూచనలు ఇవ్వనుంది. అలాగే ప్రత్యేక ట్రస్ట్ ద్వారా ఫీజు రీయింబర్స్‌మెంట్ సాధ్యాసాధ్యాలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. మూడు నెలల్లో ఈ కమిటీ నివేదిక అందజేయాలని ప్రభుత్వం జారీ చేసిన జీవోలో స్పష్టంగా సూచించింది. అలాగే విద్యా సంస్థలు స్పష్టం చేసిన సూచనలపై సైతం అధ్యయనం చేయాలని ఈ సందర్భంగా కమిటీకి రాష్ట్ర ప్రభుత్వం సూచించింది.



నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ ను కలసిన బీజేపీ నాయకులు వై శ్రీధర్, తదితరులు

# నార్మ్‌లో నుంచి రాకపోకలకు అనుమతించాలి: వై శ్రీధర్

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం): రాజేంద్రనగర్, మాణిక్యమ్మ కాలనీ ప్రాంతాల నుంచి నార్మ్ మీదుగా శంషాబాద్ వైపు వెళ్లడానికి గతంలో ఉన్న మాదిరిగా అవకాశం కల్పించాలని బీజేపీ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన నార్మ్ యాక్టింగ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ ను కలసి చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి రాసిన లేఖ ను అందజేశారు. యాభై సంవత్సరాలుగా రాజేంద్రనగర్ పరిసర బస్తీలకు చెందిన ప్రజలు, వాహనదారులు బెంగుళూరు జాతీయ రహదారి వైపు వెళ్లాలన్నా, శంషాబాద్ వైపు వెళ్లాలన్నా నార్మ్ మీదుగా వెళతారని గుర్తు చేశారు. ఇటీవల నార్మ్ లో నుంచి ప్రైవేటు వ్యక్తులను రానీయకు డ అడ్డుకుంటున్నారని, అందుకోసం చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డిని కలసి విన్నవిం చుకోగా ఆయన లేఖ రాశారన్నారు. గతంలో ఉన్న మాదిరిగానే నార్మ్‌లో నుంచి రోడ్డు వదలాలని సూచించారు. దీని వల్ల విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు ఎంతగానో మేలు ఉంటుందన్నారు. డాక్టర్ గోపాల్ లాల్ ను కలసిన వారిలో నాయకులు జి.బాబురావు, డి.యాదగిరి, ఈ వేణుగో పాల్, పి.రవీందర్, ఎన్ స్వామి తదితరులు ఉన్నారు.

# బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తప్పవు

## జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

కొత్తకోట నవంబర్ 4 (ప్రభాత ఉదయం )బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయడం నేరమని, వాటిని నివారించే బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. మంగళవారం కొత్తకోట మండలం పాలెం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గ్రామస్థాయి బాలల పరిరక్షణ కమిటీ సమావేశానికి కలెక్టర్ ఆదర్శ్ సురభి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... బాల్యవివాహాలను నిర్మూలించడం ప్రతి పౌరుడి బాధ్యత ఉందని అన్నారు. బాల్యవివాహాల నిరోధక చట్టం 2006 ప్రకారం అమ్మాయిలకు 18 సంవత్సరాలు నిండకుండా పెళ్లి చేయడం నేరమని చెప్పారు. బాల్య వివాహాల చట్టం ప్రకారం బాల్యవివాహాలను చేస్తే తల్లిదండ్రుల పైనే కాకుండా వివాహానికి హాజరైన వారు, ప్రోత్సహించిన వారు కూడా శిక్షార్హులని హెచ్చరించారు. బాల్యవివాహాలకు సంబంధించిన సమాచారం తెలిసి అధికారులకు తెలియజేయకపోవడం కూడా తప్పేనని అన్నారు. గ్రామస్థాయిలో బాల్యవివాహాలను కట్టడి చేయడంలో ఆశా వర్కర్లు అంగన్వాడి టీచర్ల పాత్ర కీలకమని



అన్నారు.ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు, గాని చిన్నారుల పైన వేధింపులు గాని సమాచారం తెలిస్తే 1098 టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్ కు కాల్ చేసి సమాచారం తెలియజేయాలని సూచించారు. పాలెం గ్రామంలో గత రెండేళ్లుగా ఒక్క బాల్యవివాహం కేసు కూడా నమోదు కాలేదని ఇది అభినందనీయమని కలెక్టర్ తెలిపారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిలో ఉద్యోగులు ఉంటే వారి ఉద్యోగాలను కోల్పోవడం జరుగుతుందని చెప్పారు. అమ్మాయిలను బాగా చదువుకోనిస్తే జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని గత సంవత్సరం జిల్లాలోని అత్యుత్తమ మార్కులు కనబరిచిందని అలాంటి అమ్మాయిలను ప్రోత్సహిస్తే పదిమందికి ఆదర్శంగా నిలుస్తారని చెప్పారు. అలాకాకుండా బాల్యవివాహాలు చేస్తే జీవితంలో ఎత్తుకు ఎదగలేరని, అంతేకాకుండా ఆరోగ్య సమస్యలు కూడా వస్తాయని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో డిపిఓ తరుణ్ చక్రవర్తి, జిల్లా సంక్షేమ శాఖ అధికారిని సుధారాణి, డిసిపిఓ రాంబాబు, కొత్తకోట తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో వినీత్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదవాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్4(ప్రభాత ఉదయం)ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు తాము అనుకున్న రంగాల్లో రాణించేందుకు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ప్రియాంక పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ ఆదేశాల మేరకు మంగళవారం గట్టు మండలం మాచర్ల, ఇందువాసి గ్రామాల్లోని జడ్పీహెచ్ఎస్ తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు ఆయా పాఠశాలల్లో ప్రత్యేక ప్రేరణాత్మక తరగతుల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ప్రతిరోజు తరగతులకు హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని అర్థం చేసుకోవాలన్నారు. ప్రతి పాఠాన్ని కేవలం ఒక సబ్జెక్టుగా చూడకుండా తమ భవిష్యత్తును మార్చే గొప్ప అవకాశంగా భావించాలని సూచించారు. ఉపాధ్యాయులు రేపు చెప్పబోయే పాఠాన్ని ఒకరోజు ముందుగానే విద్యార్థులు ఇంటి వద్ద చదువుకుని వస్తే ఆ పాఠంపై విద్యార్థులకు శ్రద్ధ పెరిగి సులభంగా అర్థమవుతుందన్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను వినకుండా ఇతర విషయాలు ఆలోచిస్తే ఏకాగ్రత కోల్పోవాల్సి వస్తుందన్నారు. క్రమశిక్షణ అలవర్చుకొని, సమయపాలన పాటిస్తూ, ఉపాధ్యాయులు ఇచ్చిన హోంవర్క్ ను ఎప్పటికప్పుడు పూర్తి చేసుకోవాలన్నారు. చదువులో చురుగ్గా రాణించాలంటే శారీరకంగా, మానసికంగా ఉల్లాసంగా ఉండేందుకు వ్యాయామం చేసేందుకు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కూడా కొంత సమయం కేటాయించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులను ఖండించిన ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

### అరెస్ట్ చేయబడిన వారిని బే షరత్ గా విడుదల చేయాలి



జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04 (ప్రభాత ఉదయం) : దాదాపు రెండు సంవత్సరాల నుండి పెండింగ్ లో ఉన్న గానుగుపహాడ్ బ్రిడ్జి నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలని, చీటకోడూర్ వాగు పై తెగిపోయిన బ్రిడ్జి నిర్మాణం వెంటనే చేపట్టాలని గానుగుపహాడ్, చీటకోడూరు బ్రిడ్జి సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో నాయకులు యాసారపు కరుణాకర్, ఉ మాపతి, మారబోయిన రాజు, కొత్త ఎలేందర్ రెడ్డి, రావుల రఘు తదితరులు సోమవారం శాంతి యుతంగా, ప్రజాస్వామ్య పద్ధతిలో నిరసన తెలిపి కోరుతున్న వారి పై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేసి రిమాండ్ చేయడం సరైన పద్ధతి కాదని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో ఖండించారు. నిత్యం వేలాది మంది ప్రయాణించే గానుగుపహాడ్, చీటకోడూరు బ్రిడ్జిల నిర్మాణం చేయకపోవడం వలన అనేక ప్రమాదాలు జరిగాయని, భవిష్యత్లో అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉండడం వలన ఈ సమస్యలను సంబధిత అధికారుల దృష్టికి తేవడానికి జనగామ కలెక్టరేట్ ముందు సోమవారం ధర్నా చేసిన ఆయా స్థానిక గ్రామస్తులను అర్ధ రాత్రి అరెస్టు చేయడం అమానుషం అన్నారు. అరెస్టులను ఖండిస్తూ, సంబంధిత గ్రామస్తులు వారి గ్రామాలకు వెళ్లే దారిలో గల బ్రిడ్జిలను త్వరగా పూర్తి చేయాలని కోరడం తప్పా..? సంబంధిత అధికారులు అక్రమంగా అరెస్ట్ చేసిన గ్రామస్తులను బేషరతుగా వెంటనే విడుదల చేసి, గానుగుపహాడ్ మరియు చీటకోడూరు బ్రిడ్జిలను త్వరలో పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



సలాం జనగాం పుస్తక ఆవిష్కరణకు కలెక్టర్ ను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

## సలాం జనగాం పుస్తకావిష్కరణకు కలెక్టర్‌కు ఆహ్వానం

### ఈనెల 8న జనగామలో సలాం జనగాం పుస్తకావిష్కరణ

### ముఖ్య అతిధిగా పాల్గొననున్న జిల్లా కలెక్టర్

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(ప్రభాత ఉదయం): సలాం జనగాం పుస్తకావిష్కరణకు ముఖ్య అతిధిగా రావాలని పుస్తక రచయిత సాంబరాజు యాదగిరి, కవులు జి.కృష్ణ, నక్క సురేష్ లు మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సలాం జనగాం పుస్తక ఆవిష్కరణకు తప్పకుండ హాజరవుతానని తెలిపారని నిర్వాహకులు ఒక ప్రకటన లో తెలియజేశారు. జనగామ జిల్లాలో చారిత్రకమైన సంఘటనలు, సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, వీరనారి అయిలమ్మ, పాలకుర్తి సోమన్న, సహజ కవి పోతన లాంటి ఎన్నో విషయాలు, వేయ్యేండ్ల చరిత్రను గ్రంథస్తం చేసిన పుస్తక ఆవిష్కరణకు, జిల్లాలోని అభ్యుదయవాదులు, కవులు, కళాకారులు ప్రముఖులు, మేధావులు, విద్యార్థులు, యువకులు, ప్రజలంతా హాజరు కావాలని రచయిత సాంబరాజు యాదగిరిని కోరారు.



బోరబండలో పోలింగ్ బూత్ ల వారిగా సమీక్ష చేస్తున్న ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీకి ప్రతిష్ఠాత్మకం

### ప్రతి కార్యకర్త ఓటరు ఇంటికి వెళ్ళాలి.. బోరబండ డివిజన్ లో పోలింగ్ బూత్‌ల వారీగా సమీక్ష చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(ప్రభాత ఉదయం): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో బోరబండ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రచార కార్యక్రమాలను మంగళవారం సమీక్షిస్తూ, అక్కడి స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సమన్వయం చేస్తూ, ప్రతి గల్లీ, ప్రతి బూత్ స్థాయిలో పార్టీ బలాన్ని పెంపొందించేందుకు ప్రత్యేక దిశానిర్దేశం చేసిన పాలకుర్తి శాసనసభ్యురాలు, బోరబండ డివిజన్ ఇంచార్జ్ యశస్విని రెడ్డి .ఈ సందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలు కాంగ్రెస్ పార్టీ కి ప్రతిష్ఠాత్మకమైనవి. ప్రతి కార్యకర్త ఓటరు ఇంటికి వెళ్లి పార్టీ అభ్యర్థి ఆలోచనలు, ప్రభుత్వ పథకాలు, ప్రజల అభివృద్ధికి కాంగ్రెస్ తీసుకుంటున్న సంకల్పం గురించి వివరించాలని సూచించారు. పార్టీ పట్ల విశ్వాసం కలిగిన ప్రతి ఒక్కరు ప్రజల్లోకి వెళ్లి, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న ప్రజా హిత కార్యక్రమాలు గృహలక్ష్మి, చెరువుల పునరుద్ధరణ, రైతులకు ఉచిత విద్యుత్, వంటి పథకాలను వివరిస్తూ, ప్రజల మద్దతు సంపాదించాలని వారు కోరారు. స్థానిక మహిళా నాయకులు, యువత, సీనియర్ కార్యకర్తలతో భేటీ అయి, వారితో సవివరంగా చర్చించి, ప్రతి బూత్ స్థాయిలో బృందాలను ఏర్పాటు చేసి సమష్టిగా ప్రచారం నిర్వహించాలనే ప్రణాళికను రూపొందించారు.. ప్రముఖ ప్రాంతాల్లో ప్రజలతో మాట్లాడుతూ...యశస్విని రెడ్డి ప్రజల సమస్యలను నేరుగా విని, నవీన్ అన్న గెలవగానే వాటిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఎమ్మెల్యే పర్యటనలో కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, మహిళా కార్యకర్తలు, యువజన కాంగ్రెస్ సభ్యులు పాల్గొన్నారు.

## పద్మశాలిపురం బస్తీలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటన

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం) : పద్మశాలిపురం బస్తీలో మంగళవారం మైలార్దేవుపల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి పర్యటించి ప్రజలనుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బస్తీలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. పారిశుధ్య నిర్వాహణ అస్తవ్యస్థంగా ఉందని, ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రం చేసేలా చూడాలన్నారు. సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఏఈ నర్సింహ్మామూర్తి, వర్క్ ఇన్స్ పెక్టర్ రాహుల్ రెడ్డి, నాయకులు బుచ్చిరెడ్డి. ఎల్వీ రెడ్డి, రాజ్ కుమార్, రామక్రిష్ణ పాండురంగారెడ్డి, భూపతిరెడ్డి, మల్లికార్జున్, బట్టు మదుసూదన్ రెడ్డి, శంకర్ రెడ్డి , రమేశ్ రెడ్డి, అభి, శివ, చారి తదితరులు పాల్గొన్నారు.



పద్మశాలిపురం బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



పరిసరాలను ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలని పారిశుధ్య సిబ్బందికి సూచిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి



## ప్రజల భాగస్వామ్యంతో సంపూర్ణ భద్రత: ఎస్సై శ్రీనివాస్

### కేటిదొడ్డి నూతన ఎస్ఐ కు బీజేపీ నాయకుల ఘన సన్మానం

గద్వాల జిల్లా ప్రతినిధి(కేటిదొడ్డి) నవంబర్ 4(ప్రభాత ఉదయం) కేటి దొడ్డి పోలీస్ స్టేషన్ నూతన ఎస్సై గా పి. శ్రీనివాసులు బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మంగళవారం కేటి దొడ్డి బీజేపీ మండలాధ్యక్షులు శ్రీపాదరెడ్డి అధ్వర్యంలో నాయకులు నూతన ఎస్ఐ శ్రీనివాసులును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి పార్టీసీనియర్ నాయకులు హన్మి రెడ్డి,భీమ్ రెడ్డి,మైలగడ్డ రాములు,సూర్య కాంత రెడ్డి,దేవేందర్ రెడ్డి ముంగిలి వీరేష్, ఉమిత్యల పెద్ద కరెప్ప, చిన్న కరెప్పా,కొండన్న, జమ్మన్న, తిమ్మప్ప,కేటిదొ డ్డి వీరేష్ ,రఘు, ,రంగాపురం కృష్ణా, వచ్చా నాయక్, తదితరులు పాల్గొన్నారు



## విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్4(ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఈనెల 7వ తేదీన నిర్వహించనున్న 'చలో హైదరాబాద్'ను విజయవంతం చేయాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.లక్ష్మీరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గద్వాల పట్టణం పాత హౌసింగ్ బోర్డులో గల రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో విశ్రాంత ఉద్యోగుల సమస్యలపై చలో హైదరాబాద్ వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వలకు చాలాసార్లు విశ్రాంతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశామన్నారు. పెన్షనర్లకు నగదు రహిత ఈహెచ్ఎస్ సేవలను అన్ని కార్పొరేట్ హాస్పటల్స్‌లో అందించాలని, మార్చి 2024 తర్వాత రిటైర్డ్ అయిన వారికి పెన్షన్లు, బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఐదు డీఆర్ బకాయిలు ఒకేసారి చెల్లించాలని, పీఆర్సీ అమలు పరుస్తూ బకాయి అందించాలన్నారు. ఈ కార్యక్రమం లో రిటైర్డ్ ఉద్యోగస్తుల సంఘం, ప్రధాన కార్యదర్శి ఆర్.చక్రధర్ కోశాధికారి బీసిరెడ్డి, రిటైర్డ్ ఉద్యోగస్తులు ఎం.కృష్ణారెడ్డి, వీర వసంత రాయుడు, యు.సత్యనారాయణ, ఎన్.నరసింహులు, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## జాతర వసూళ్లపై ఇంటిలిజెన్స్ అధికారుల ఆరా

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 4(ప్రభాత ఉదయం) కేటిదొడ్డి మండలం వెంకటాపురం గ్రామంలో జరిగిన పాగుంట జాతరల్లో చిరు వ్యాపారుల నుంచి పోలీస్ అధికారుల వసూళ్ల పై రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇప్పటికే ఆరోపణలు ఎదుర్కొంటున్న నేపథ్యంలో కేటిదొడ్డి ఎస్ఐ బి.శ్రీనివాసులు, కానిస్టేబుల్ రజనీబాబును ఏఆర్ కు అటాచ్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా జాతర వసూళ్లలో గద్వాల్ సీఐ టంగుటూరి శ్రీను పాత్రపై మంగళవారం గద్వాల జిల్లా ఏ ఎస్పీపీ శంకర్, ఎస్బీ సీఐ ఆర్.రవి కేటిదొడ్డి పోలీస్ స్టేషన్ కు వెళ్లి విచారణ చేపట్టారు. అలాగే వెంకటాపురం శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో, గ్రామ ప్రజలను విచారించినట్లు తెలిసింది. అక్రమ వసూళ్లు నిర్ధారణకు వస్తే తదుపరి యాక్షన్ తీసుకునేందుకు సిద్దమైనట్లు తెలిసి ంది. అలాగే పోలీస్ స్టేషన్ సిబ్బంది వేరు వేరుగా విచారించినట్లు తెలిసింది. స్టేషన్ కు వచ్చి ఫిర్యాదు దారులను, ప్రజలను నుంచి ముఖ్యమైన సమాచారం తీసుకున్నట్లు తెలిసింది.



సలాం జనగాం పుస్తక ఆవిష్కరణకు కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు

సలాం జనగాం పుస్తకావిష్కరణకు కలెక్టర్‌కు ఆహ్వానం

ఈనెల 8న జనగామలో సలాం జనగాం పుస్తకావిష్కరణ

ముఖ్య అతిధిగా పాల్గొననున్న జిల్లా కలెక్టర్

జనగామ జిల్లా ప్రతినిధి, నవంబర్ 04(ప్రభాత ఉదయం): సలాం జనగాం పుస్తకావిష్కరణకు ముఖ్య అతిధిగా రావాలని పుస్తక రచయిత సాంబరాజు యాదగిరి, కవులు జి.కృష్ణ, నక్క సురేష్ లు మంగళవారం జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సలాం జనగాం పుస్తక ఆవిష్కరణకు తప్పకుండ హాజరవుతానని తెలిపారని నిర్వాహకులు ఒక ప్రకటన లో తెలియజేశారు. జనగామ జిల్లాలో చారిత్రకమైన సంఘటనలు, సర్వాయి పాపన్న, దొడ్డి కొమురయ్య, వీరనారి అయిలమ్మ, పాలకుర్తి సోమన్న, సహజ కవి పోతన లాంటి ఎన్నో విషయాలు, వేయ్యేండ్ల చరిత్రను గ్రంథస్తం చేసిన పుస్తక ఆవిష్కరణకు, జిల్లాలోని అభ్యుదయవాదులు, కవులు, కళాకారులు ప్రముఖులు, మేధావులు, విద్యార్థులు, యువకులు, ప్రజలంతా హాజరు కావాలని రచయిత సాంబరాజు యాదగిరిని కోరారు.



గురుకుల కళాశాలలో వాటర్ ప్లాంటును ప్రారంభించిన కే లక్ష్మణ్..

# గురుకుల కళాశాల అభివృద్ధికి సహకారం అందిస్తా:

## రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి (ఘట్కేసర్ మున్సిపల్) ఆగస్ట్ 04 (ప్రభాత ఉదయం) మంగళవారం ఘట్కేసర్ గురుకుల కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తామని రాజ్యసభ సభ్యులు లక్ష్మణ్ అన్నారు. ఘట్కేసర్ గురుకుల్ కళాశాలలో గురుకుల పరిరక్షణలో భాగంగా గురుకుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో రాజ్యసభ సభ్యులు కే లక్ష్మణ్ సహకారంతో %వా. చీ. +. జ% వారి సౌజన్యంతో వాటర్ ప్లాంట్ ను తన సొంత ఖర్చులతో మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి గురుకుల్ కళాశాలలో దాన్ని మరమ్మత్తు చేసి మాజీ ఎంపీపీ బండారి శ్రీనివాస్ గౌడ్. జేఏసీ కన్వీనర్ మారాం లక్ష్మారెడ్డి ల తో కలిసి ప్రారంభిచారు. విద్యార్థులు సేవ్ గురుకుల్ అని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ గురుకుల్ పరిరక్షణ సమితి వారికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం మరుగుదొడ్ల పనులను పర్యవేక్షించి త్వరలో విద్యార్థులకు అందుబాటులో వచ్చేటట్టు చేస్తామని అన్నారు. తన సొంత ఖర్చులతో గురుకుల్ రైల్వే గేట్ ప్రహరీ గోడ అసంపూర్తిగా మిగిలి ఉన్నందున అది పూర్తి చేయుటకు తన సొంత గ్రామమైన ఘట్కేసర్ కి శ్రేయోభిలాషి కందకట్ల మాధవ రెడ్డి ఇనుప కంచెను పనులను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గురుకుల్ పరిరక్షణ సమితి సభ్యులు శ్రేయోభిలాషులు, విద్యార్థిని విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ చేసిన హెడ్మాస్టర్ రామ్ రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

# విద్యతోనే సమాజాభివృద్ధి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

## హెడ్మాస్టర్ రామ్ రెడ్డి విద్యాభివృద్ధి కోసం చేసిన సేవలు ఎనలేనివి: ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

శంషాబాద్, నవంబర్ 4 (ప్రభాత ఉదయం) ప్రధానోపాధ్యాయులుగా పదవి విరమణ చేసిన రామ్ రెడ్డి విద్యాభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేశారని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ అన్నారు. మంగళవారం శంషాబాద్ మండలం నర్కుడ జిల్లా పరిషత్ పాఠశాల హెడ్ మాస్టర్ రాంరెడ్డి పదవీ విరమణ సన్మాన సభలో ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మంగళవారం నర్కుడ జెడ్పీహెచ్ఎస్ పాఠశాల హెడ్ మాస్టర్ రాంరెడ్డి పదవీ విరమణ చేసిన సందర్భంగా నర్కుడలోని మహాలక్ష్మి గార్డెన్ లో జరిగిన రామ్ రెడ్డి సన్మాన సభలో ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ ...రాంరెడ్డి విద్యారంగానికి చేసిన సేవలను, ఆయన నిబద్ధతను ఈ సందర్భంగా కొనియాడారు. విద్యార్థుల భవిష్యత్తుకు మార్గదర్శనం చేసే గురువుల పాత్ర అత్యంత కీలకమని, సమాజంలో వారికి ప్రత్యేక గౌరవం ఉంటుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా రాంరెడ్డిని శాలువాతో సన్మానించి, జ్ఞాపికను అందజేశారు. రాంరెడ్డి కి సుదీర్ఘ, ఆరోగ్యకరమైన పదవీ విరమణ జీవితం గడపాలని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు , తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తండ్రి విద్యార్థుల కోసం ప్రభుత్వంతో పోరాటం

## కొమురం భీమ్ వేషధారణలో ఆకట్టుకున్న కుమారుడు




విద్యార్థుల ఫీజు రియంబర్స్ మెంట్ కోసం పోరాడుతున వేముల రామక్రిష్ణ

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం) : వేముల రామక్రిష్ణ కుమారుడు వేముల వేధ అర్జున్ కొమురం భీమ్ వేషధారణలో ఆకట్టుకున్నాడు. రెండు రోజుల క్రితం రాజేంద్రనగర్ భారతీయ విద్యా భవన్ విద్యాశ్రం (బీవీబీవీ) జరిగిన కార్యక్రమంలో వేధ అర్జున్ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు కొమురం భీమ్ వేషధారణ లో ఏక పాత్రాభినయం చేశారు. అతన్ని చూసిన చాలా మంది తండ్రి వేముల రామక్రిష్ణ విద్యార్థుల తరపున ప్రభుత్వంతో పోరాడుతుంటే... కొడుకు దున్నే వాడికే భూమి కావాలని రజాకార్లతో పోరాడి దొరలను తరిమికొట్టిన కొమురం భీమ్ వేషధారణలో కనిపించడం సంతోషకరమని చర్చించుకున్నారు. శభాష్ వేధ అర్జున్ అని ప్రశ్నించారు.



కొమురం భీమ్ వేషధారణలో వేముల వేధ అర్జున్

# నార్మ్‌లో ముగిసిన విజిలెన్స్ వారోత్సవాలు



విద్యార్థులకు సర్టిఫికెట్ లను అందచేస్తున్న డాక్టర్ గోపాల్ లాల్



ప్రతిజ్ఞ చేస్తున్న నార్మ్ అధికారులు, ఉద్యోగులు, విద్యార్థులు

బుద్వేల్, నవంబరు 4 (ప్రభాత ఉదయం) : ప్రజా సేవకు సంబందించిన అన్ని అంశాలలో పారదర్శకత, సమగ్రత, జవాబుదారితనం అవసరం అని రాజేంద్రనగర్ లోని నేషనల్ అకాడమీ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ మేనేజ్మెంట్ (నార్మ్) డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ అన్నారు. నార్మ్ లో అక్టోబరు 27న ప్రారంభమైన విజిలెన్స్ వారోత్సవాలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా నార్మ్ ఉద్యోగులు, అధికారులు, ఫోకార్స్ కోర్సులో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ అగ్రికల్చర్ సైంటిస్ట్ ల చేత ఆయన అవినీతి కి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. విధి నిర్వహణలో నైతికంగా వ్యవహరిస్తామన్నారు. తాము పనిచేసే చోట జవాబుదారితనం కలిగి ఉంటామని, బాధ్యతతో నిజాయితీగా వ్యవహ రిస్తామన్నారు.

**వివిధ రకాల పోటీలు :**

శంషాబాద్ మండలం నర్కూడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విజిలెన్స్ వారోత్సవాలలో బాగంగా పెయింటింగ్ పోటీలను ఏర్పాటు చేశారు. నార్మ్ అగ్రి బిజినెస్ మేనేజ్మెంట్ విద్యార్థులకు నైతిక మార్పుకు యువత పాత్ర అనే అంశంపై వకృత్వ పోటీలు నిర్వహించారు. మెదక్ జిల్లా కుల్చారం మండలం, పోతిరెడ్డి గ్రామంలో విజిలెన్స్ అవగాహన గ్రామ సభ నిర్వహించారు. క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు అవినీతి నిరోధకానికి చేపడుతున్న జాగ్రత్తలు, నిఘా పై అవగాహన కల్పించారు. నార్మ్ ఆధ్వర్యంలో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన వారికి నార్మ్ డైరెక్టర్ డాక్టర్ గోపాల్ లాల్ సర్టిఫికెట్లు, బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో నార్మ్ విజిలెన్స్ అదికారి డాక్టర్ డి.తమ్మిరాజు, సీఏఓ (ఎసీ) వివేక్ పూర్వర్ లు పాల్గొన్నారు.

# జూబ్లీహిల్స్‌లో బిజెపి గెలుపు ఖాయం




కమలం గుర్తుకు ఓటు వేయాలని మహిళను అభ్యర్థిస్తున్న బిజెపి మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం వనితా రెడ్డి



మహిళ నుదుట బొట్టు పెట్టి ఓటు అభ్యర్థిస్తున్న మహిళ నాయకురాళ్లు



సమావేశం నిర్వహించిన బిజెపి మహిళా నాయకురాళ్లు

## బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి

జూబ్లీహిల్స్, నవంబర్ 4(ప్రభాత ఉదయం) జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల లో బిజెపి అభ్యర్థి దీపక్ రెడ్డి కి ఓటు వేయాలని బిజెపి మహిళా మోర్చా నాయకురాళ్లు ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని రహమత్ నగర్ డివిజన్ పరిధిలోని కార్మిక నగర్, ఎల్ ఆర్ స్కూల్ ప్రాంతాలలో కమలం గుర్తుకు ఓటు వేయాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా బిజెపి మహిళా మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుగుణ రెడ్డి మాట్లాడుతూ... జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో ప్రజలు బిజెపికి ఓటు వేయటానికి ఆసక్తి చూపుతున్నారని గెలుపు ఖాయమన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో జిల్లా మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి ఎం వనితా రెడ్డి,అనురాధ, నాగమణి, తదితరులు ప్రచార కార్యక్రమంలో పాల్గొన్నారు.



# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహర్ నగర్ కార్పొరేషన్ ) ఆగస్టు 04 ( ప్రభాత ఉదయం )మంగళవారం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బీసీల రిజర్వేషన్ సాధన సమితి పిలుపుమేరకు బీసీల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయించాలని కాప్రా మండల డిప్యూటీ తహసిల్దార్ కు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ...జవహర్ నగర్ కార్పొరేషన్ బీసీ కన్వీనర్లు మాట్లాడుతూ... కేంద్రం వెంటనే బీసీ బిల్లును 9 వ షెడ్యూల్లో చేర్చాలని చేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లికేంద్రం పై ఒత్తిడి తీసుకురావాలని అన్నారు. రాబోయే శీతాకాల సమావేశాల్లో ఈ బిల్లును కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో జవహర్ నగర్ బీసీల ఐక్యవేదిక కన్వీనర్ మరోజు సోమచారి, వజ్రోజు వెంకటాచారి, పాక దేవేందర్ గంగపుత్ర, రేగోటి సురేష్ పద్మశాలి, కేకే చారి, యకాచారి, శనిగరం నరసింహ రజక, ఈ కార్యక్రమానికి బీసీ రిజర్వేషన్ సాధన సమితి, నాయకులు, బండ కింది ప్రసాద్ గౌడ్, బోయిన్పల్లి నరసింహ, నరేష్ గౌడ్, బత్తిని అశోక్, పాల్గొని ఈ యొక్క కార్యక్రమానికి మద్దతు ప్రకటించారని తెలిపారు.

# జవహర్ నగర్‌లో గ్రంథాలయానికి స్థలం కేటాయించాలి

## ఎంఆర్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివ మాదిగ



మేడ్చల్ జిల్లా ప్రతినిధి ( జవహర్ నగర్ కార్పొరేషన్ ) ఆగస్టు 04 ( ప్రభాత ఉదయం ):- వివాహనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గ్రంథాలయం ఏర్పాటు ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శివకుమార్ మాదిగ అన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జవహర్ నగర్ మున్సిపల్ కారార్పరేషన్ పరిధిలోని సర్వే నెం 340 లో ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని డా॥ బి. ఆర్. అంబేద్కర్ గ్రంథాలయానికి కేటాయించాలని గత సంవత్సరం 2024 నవంబర్ 20వ రోజున కాప్రా మండలం తహసీల్దారుగా ఉన్నటువంటి సుచరితకు వినతి పత్రం ద్వారా కోరమని చెప్తా అన్నారు. అప్పటి తాసిల్దార్ సుచరిత సానుకూలంగానే స్పందించినారని చెప్పారు. కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. జవహర్ నగర్ లో నివసిస్తున్న నిరుపేదలైన బిసి, ఎస్సీ, ఎస్టి, మైనారిటీలతో పాటు అగ్రకుల పేదలకు చెందినవారు ఉన్నారన్నారు. ఎంతోమంది విద్యావంతులు నిరుద్యోగులకు ఉపయోగకరంగా ఉండేందుకు గ్రంథాలయ అవసరం అన్నారు. చదువుకుంటున్న యువత భవిష్యత్తు పక్కదారి పట్టకుండా సక్రమమైన మార్గంలో నడిచే విధంగా ఉపయోగ పడుతుందన్నారు. సర్వేనెంబర్ 340 లో గల ప్రభుత్వ స్థలాన్ని కబ్జాదారుల కోరల్లో చిక్కకుండా చర్యలు చేపట్టాలని తాసిల్దార్ కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. నిరుద్యోగులకు జ్ఞానాన్ని పెంపొందించేందుకు బి. ఆర్ అంబేద్కర్ గ్రంథాలయానికి స్థలం కేటాయించాలని కాప్రా మండల తాసిల్దార్ బైరెడ్డి రాజేష్ ను కోరినట్లు చెప్పారు. సానుకూలంగా స్పందించిన తహసీల్దార్ గ్రంథాలయానికి స్థలాన్ని కేటాయించి అదేవిధంగా నిధులు వచ్చేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.



# రాజేంద్రనగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్మోహన్‌ను సన్మానించిన ఉద్యోగుల 1104 యూనియన్ నాయకులు

మెహిదీపట్నం, నవంబర్ 4(ప్రభాత ఉదయం) రాజేంద్ర నగర్ విద్యుత్ సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ ను మంగళవారం సర్కిల్ విద్యుత్ 1104 ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. సర్కిల్ ఎస్ ఈ శ్రీరామ్ మోహన్ తో పాటు డివిజనల్ ఇంజనీర్ (టెక్నికల్) ఎం శివ శంకర్ ను యూనియన్ సర్కిల్ బాడీ తరపున శాలువాతోసత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజేంద్ర నగర్ సర్కిల్ 1104 యూనియన్ ప్రెసిడెంట్ బాబురావు , సర్కిల్ సెక్రటరీ ఎం లక్ష్మినారాయణ గౌడ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ , అడిషనల్ సెక్రటరీ బాషు నాయక్, రాష్ట్ర, కంపెనీ నాయకులు, కార్యవర్గ సభ్యులు, ఎం ఆర్ టి డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు,రాజేంద్ర నగర్ , కందుకూరు, షాద్ నగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు, బాడీ, సర్కిల్ మెంబెర్స్, సర్కిల్ యూనిట్ సభ్యులు , సభ్యులు పాల్గొన్నారు.

# వైద్య సీటు సాధించిన పేదింటి అమ్మాయి

## ఫీజు కోసం దాతలు ముందుకు రావాలి



మక్తల్ , నవంబర్4(ప్రభాత ఉదయం)నారాయణపేట జిల్లా మక్తల్ మండలం చిట్యాల గ్రామానికి చెందిన ఆదివాసి ఏకలవ్య బిడ్డ ఎస్. ఇందుకి ప్రతిమ ప్రైవేట్ మెడికల్ కళాశాల వరంగల్ లో ఎంబీబీఎస్ సీటు లభించింది. దీంతో మొదటి సంవత్సరం ఫీజు రూ. 1. 20లక్షలు. అయితే లక్ష 20వేలు చెల్లించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో దాతల సహాయం చేయాలని అభ్యర్థి చేస్తున్నారు. ఇందు తల్లిదండ్రులు రాధిక, చెన్నప్పకు ముగ్గురు ఆడపిల్లలు కావడం గమనార్హం. కూలీ పనులు చేయించుకుంటూ వీరిని చదివించారు. ఈ కుటుంబానికి వ్యవసాయ భూములు, ఎలాంటి ఆస్తులు లేవు. రెక్కాడితే గానీ డొక్కాడదు. చిన్న ఇంట్లో ఉంటూ ముగ్గురు కూతుర్లను గురుకులంలో చదివిస్తున్నారు. పెద్ద కూతురు ఇందు పదో తరగతిలో 9. 5, ఇంటర్ లో 950 మార్కులు సాధించింది. ప్రభుత్వ గురుకుల కళాశాలలో చదువుకుంది. నీట్ లో వచ్చిన మెరిట్ కి ప్రతిమ ప్రైవేట్ మెడికల్ కళాశాల వరంగల్ లో ఎంబీబీఎస్ ప్రథమ సంవత్సరం సీటు వచ్చింది. చదవాలన్న సరస్వతి పుత్రిక ఇందుకు ఆర్థిక పరిస్థితి అడ్డు వస్తోంది. ఇంటి వద్ద కూలీ పనులకు వెళ్తోంది. ఎవరైనా దాతలు ముందుకు వచ్చి ఎంబీబీఎస్ చదువుకు పూర్తి సహాయం చేయగలరని ఆ విద్యార్థిని అభ్యర్థిస్తోంది. దాతలు ఆర్థిక సహాయం చేయాలనుకుంటే 9553628001, 6305646827, 905 99 99 510 ఈనెంబర్లకు ఆన్ లైన్ పంపించవచ్చు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608